ఇదేమి ప్రజాపాలన?

- ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహావేశాలు
- గందరగోళంగా ప్రజాపాలన సభలు
- ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీస్తున్న ప్రజలు
- లబ్ధిదారుల ఎంపికపై అభ్యంతరాలు
- ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని మండిపాటు

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సభలు ప్రజల ఆగ్రహావేశాలకు గురవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. ఏడాది కిందట ప్రజాపాలన అంటూ ఇంటింటికీ దరఖాస్తులు తీసుకొని కేవలం కొందరి పేర్లే అర్హులుగా ప్రకటించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని అడుగగా అధికారులు తెల్లమొఖం వేయాల్సిన దుస్థితి నెలకొన్నది. పోలీసుల పహారా మధ్య ప్రజాపాలనపై సభలు నిర్వహిస్తున్నా ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి.

– నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, జనవరి 22

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆత్మకూరులో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

ఆత్మకూరులో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఆత్మకూరు, జనవరి 22 : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం ఆత్మకూరు సర్కారు దవాఖానాలోని క్లస్టర్ భవనంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దవాఖానలో కావాల్సిన వసతులను గురించి వివరించారు. ఈ దవాఖాన స్థలంలోనే మెటర్నిటీ దవాఖానను నిర్మిస్తే చుట్టుపక్కల మండలాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం 100 పడకల నూతన దవాఖాన నిర్మాణానికి పీజేపీ క్యాంప్‌లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. స్పందించిన మంత్రి మెటర్నిటీ దవాఖాన, 100పడకల దవాఖానకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు, తాసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీవో శ్రీరాంరెడ్డి, కమిషనర్ శశిధర్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పాల్గొన్నారు.

సబ్ సెంటర్‌ను పీహెచ్‌సీగా ఏర్పాటు చేస్తాం..

అమరచింత, జనవరి 22 : మండల కేంద్రంలో ఆరోగ్య సబ్ సెంటర్‌గా ప్రజలకు సేవలందిస్తున్న డీఎంఆర్ దవాఖానను త్వరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేస్తామని వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ వెల్లడించారు. బుధవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో అమరచింత ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. వీరి వెంట వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీఎం హెచ్‌వో శ్రీనివాసులు, అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ వారికి స్వాగతం పలికారు. పుట్టిన గ్రామానికి విద్యా, వైద్యం అందించేందుకు సొంత నిధులతో పాఠశాల, దవాఖాన నిర్మాణం చేపట్టిన దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి సేవలను ప్రత్యేకంగా అభినందించారు.

గతంలో ఇచ్చిన దరఖాస్తులేవీ?

అమరచింత, జనవరి 22 : గతంలో ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని, ఇప్పుడు మళ్లీ ఎందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. బుధవారం అమరచింతలోని ఐదు వార్డులో, మండలంలోని కృష్ణంపల్లి, నాగతూర్మాల్, పాంరెడ్డిపల్లి, సింగంపేట, మిట్టనందిమల్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా, అర్హులను కాకుండా ప్రభుత్వం విడుదల చేసిన లిస్టులో అనర్హులు పేర్లు ఎలా ఇస్తారని నిలదీశారు. తాసీల్దార్ రవికుమార్, డీపీవో సురేశ్, ఎంపీడీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నదీబ్ మాట్లాడుతూ ఇప్పుడు ప్రకటించే లిస్టు ఫైనల్ కాదని, అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమరచింత మండలం క్రిష్ణంపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

బీఆర్ఎస్ నాయకుడు అంగడి బస్వరాజుకు నచ్చచెప్పుతున్న ఎస్సై కేటీ మల్లేశ్

మాటలు తప్పా చేతల్లో శూన్యం..

గట్టు, జనవరి 22 : మండలంలోని పెంచికలపాడులో బుధవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సింగిల్‌విండో చైర్మన్ బస్వరాజు గ్యారెంటీలు ఎక్కడ అమలు చేశారంటూ సభలో ప్రశ్నించారు. కాంగ్రెస్ మాటలు తప్పా చేతల్లో చేసింది శూన్యమన్నారు. రూ.2లక్ష రుణమాఫీ ఎక్కడ పూర్తిగా అమలు చేశారని అడిగారు. దీంతో డిప్యూటీ తాసీల్దార్ శివశంకర్ నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. మీ సమస్యలు ఏవైనా ఉంటే వినతిపత్రం అందజేస్తే ఉన్నతాధికారులకు నివేదించి స్పష్టం చేశారు. ఇది లాగూ అక్కడ జరుగుతున్న పరిస్థితిని అధికారులు మండలస్థాయి అధికారులకు తెలియచేశారు. కొంత సమయం తరువాత ఎస్సై కేటీ మల్లేశ్ బస్వరాజుతోపాటు గ్రామస్తులకు నచ్చజెప్పి గ్రామసభ నిర్వహించేలా సర్దిచెప్పారు.

ఇదిలా ఉండగా, చాగదోణ, చమన్‌ఖాన్‌దొడ్డి, తప్పెట్లమొర్సు, ఆలూరు, వాయిల్‌కుంటతండా, గంగిమాన్‌దొడ్డి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

ఏడాదైనా అన్‌లైన్ చేయరా?

- ఉత్తనూరులో నిలదీసిన గ్రామస్తులు

అయిజ : ఉత్తనూర్‌లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

అయిజ, జనవరి 22 : గతేడాది స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా ఇప్పటి వరకు ఏం చేశారని, మళ్లీ దరఖాస్తులంటూ ఎందుకు అయోమయానికి గురిచేస్తున్నారని అధికారులను ప్రజలు నిలదీశారు. బుధవారం అయిజ మండలంలోని ఉత్తనూర్‌లో ప్రజాపాలన గ్రామసభను ఆర్ఐ మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల అర్హుల జాబితాను గ్రామస్తులకు వెల్లడించారు. గతేడాది ప్రజాపాలనలో 600 దరఖాస్తులను స్వీకరించి, కేవలం 535 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి, మిగితా దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని గ్రామస్తులు మండిపడ్డారు. 75 మందిలో దాదాపు 70 శాతం మంది పేదలేనని, ఆన్‌లైన్ చేయక పోవడంతో సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోవాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులను నిలదీయడంతో గ్రామసభ గందరగోళంగా మారింది.

ఎన్నాళ్లు కాలయాపన చేస్తారు?

పెబ్బేరు, జనవరి 22 : ప్రభుత్వ పథకాల కోసమని ప్రజల నుంచి ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించి, మళ్లీ దరఖాస్తులంటూ ఎందుకు కాలయాపన చేస్తున్నారని శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామస్తులు అధికారులను నిలదీశారు. బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక దరఖాస్తుల పేరిట ఎందుకు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని శ్రీరంగాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్నాథం నాయుడు ఆరోపించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో అధికారులు తూతూ మంత్రంగా గ్రామసభ నిర్వహించి వెళ్లిపోయారు.



వెంకటాపురంలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదం..

కొత్తకోట, జనవరి 22 : మండలంలోని కనిమెట్టలో ఉద్రిక్తత నెలకొన్నది. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో కాంగ్రెస్ నాయకులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చివరికి కొట్టుకునే వరకు వెళ్లింది. అలాగే పామాపురం గ్రామసభ గొడవకు దారితీసింది. ఇందిరమ్మ ఇండ్ల లిస్ట్ తప్పుల తడకగా, రైతు భరోసా, రైతు రుణమాఫీ, వరి ధాన్యానికి బోనస్, ఆసరా ఫించన్ల పెంపుపై అధికారులను నిలదీయగా అధికారులు ముఖం తిప్పుకొని వెళ్లిపోయారు.

లబ్ధిదారుల ఎంపిక ఎలా చేశారు?

మద్దికల్, జనవరి 22 : మండలంలోని మల్లెందొడ్డిలో బుధవారం జరిగిన గ్రామసభలో ప్రజలు అధికారులను ప్రభుత్వ పథకాలపై నిలదీశారు. గ్రామాల్లో కమిటీలు ఉండగా, సమాచారం లేకుండా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక ఎలా చేశారని అధికారులను కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం అధికారులను నిలదీశారు. ఈ సభను రద్దు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మరో రోజు గ్రామసభను నిర్వహించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో ఆంజనేయరెడ్డికి విషయాన్ని తెలిపారు. అలాగే మండలంలోని పావనంపల్లి, దాసరిపల్లి, నేతువానిపల్లి, అమరవాయి, నాగర్‌దొడ్డి, తాటికుంట్లో గ్రామ సభలు నిర్వహించారు.

తప్పుదోవ పట్టించేందుకే గ్రామసభలు

కొత్తకోట, జనవరి 22 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రజాపాలనలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సుకేసిని పాల్గొన్నారు. ముందుగా అధికారులు అర్హుల జాబితాను వివరించగా, ప్రతిపక్ష నాయకులు కలుగజేసుకొని ప్రజలకు తప్పుదోవ పట్టించడం తప్పా ఈ దరఖాస్తులతో ఎలాంటి ప్రయోజనం లేదని మండిపడ్డారు. దీంతో ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. అనంతరం మున్సిపల్ చైర్మన్ సుకేసిని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పినా ఇచ్చిందేమీ లేదని అన్నారు. ఏ ఒక్క హామీ కూడా సరిగా అమలు చేయకుండా మళ్లీ ప్రజలతో దరఖాస్తులు తీసుకొని ఏం చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ బాబు, మున్సిపల్ కమిషనర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, జనవరి 22 : పట్టణానికి చెందిన సత్యనారాయణకు ఆపరేషన్ కోసం బుధవారం ఎమ్మెల్యే విజయుడు రూ.5లక్షల ఎల్‌వోసీ కాపీని అందజేశారు. అలాగే ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో స్వాతంత్ర సమర యోధుడు వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వడ్డెర సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఉండవల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తల్లి ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాజశేఖర్, సుంకన్న, లోకారెడ్డి, మక్బూల్, షేక్షావలీ, కొండన్న, అక్బర్, అలీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకేనా గ్రామసభలు?

వల్లభాపురం గ్రామసభలో అధికారులను నిలదీస్తున్నస్థానికులు

వీపనగండ్ల, జనవరి 22 : సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మభ్య పెట్టడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం తూతూ మంత్రంగా గ్రామ సభలు నిర్వహిస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని వల్లభాపురం, వల్లభాపురం తండా, తూముకుంట, గోవర్ధనగిరిలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత లేకుండా ఎన్నిసార్లు దరఖాస్తులు స్వీకరిస్తారని వల్లభాపురం, కల్వరాల గ్రామాల్లో స్థానికులు అధికారులను నిలదీశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి తుది జాబితా రూపొందించాలన్నారు.

కార్యక్రమంలో తాసీల్దార్ వరలక్ష్మి, ఎంఈవో నరసింహ, ఏపీఓ ధర్మకేశ్వర్ గౌడ్, గ్రామ పెద్దలు తేజారెడ్డి, సాయిరాం, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

- మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

వంటగదిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి షేక్ యాస్మిన్ బాషా

వనపర్తి టౌన్, జనవరి 22 : ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం మెస్, కాస్మెటిక్ చార్జీలను భారీగా పెంచిందని, వసతి గృహాల్లో కామన్ డైట్ మెనూ పక్కాగా అమలు చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సీనియర్ మహిళా ఐఏఎస్ అధికారులు బాలికల వసతి గృహాల్లో బస చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచన మేరకు వనపర్తి జిల్లాకు ప్రత్యేక అధికారిగా షేక్ యాస్మిన్ బాషా బుధవారం గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు ఆమె వెంట ఉన్నారు. కామన్ డైట్ మెనూ అమలు చేస్తున్నారా లేదా అని ప్రిన్సిపాల్‌ను ఆరా తీశారు. వంట సామగ్రికి సంబంధించి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రమణ్యం, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అష్టలుద్దీన్, ప్రిన్సిపాల్ సరస్వతి తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జనవరి 22 : పేదలకు సీఎం సహాయనిధి వరమని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గట్టు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 14మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం కేటిదొడ్డి మండల కేంద్రంతోపాటు ఉమిత్యాల తండాలో జరిగిన గ్రామసభలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, సిద్ధిరామప్ప, అలీ, శేఖర్‌రెడ్డి, సురేశ్, శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, జనవరి 22 : ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ తోట శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌక్ వద్ద విద్యార్థులతో ఏర్పాటు చేసిన ర్యాలీకి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అతివేగం, మద్యం తాగి వాహనం నడపడం వల్ల మనతోపాటు ఎదుటి వాహన దారులకు సైతం ప్రమాదమన్నారు. అనంతరం వాహనాలకు రోడ్డు భద్రతా మహోత్సవాలకు సంబంధించి స్టిక్కర్‌ను అంటించారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, ఇన్‌చార్జి డీటీవో కృష్ణారెడ్డి, సీఐ శ్రీను, ఎంవీఐ రాములు నాయక్, ఏవో రమేశ్‌కుమార్, ఎస్సైలు కల్యాణ్‌కుమార్, శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్సై బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

గోపాల్‌పేట, జనవరి 22 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తాడిపర్తి, జయన్నతిర్మలాపురం, కర్నెమయ్య కుంటతండా, లక్ష్మీతండా, జింకతొండు తండాలో గ్రామసభలు నిర్వహించారు. తాడిపర్తిలో చిన్నా డ్డితోపాటు కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు. జాబితాలో ఏమైనా మార్పులు చేర్పులు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్ నాయక్, తాసీల్దార్ తిలక్ కుమార్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

వనపర్తి టౌన్, జనవరి 22 : పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. జిల్లా కేంద్రంలోని 14వ వార్డు బ్రహ్మంగారి వీధిలో నిర్వహించిన వార్డు సభకు ఎమ్మెల్యే మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు.

సభలను సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల, జనవరి 22 : సంక్షేమ పథకాలు లబ్ధిపొందేందుకు అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రామ, వార్డు సభలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 27వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభల్లో కలెక్టర్ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మఆత్మీయ భరోసా పథకాలు అమలు చేయనున్నదని చెప్పారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజల అభివృద్ధికి ఎంతో దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్ దశరథం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పార్టీలో లేకపోతే ఎమ్మెల్సీల ఫొటోలు ఉండవా?

పెద్దమందడి, జనవరి 22 : కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కాకపోతే ప్రోటోకాల్ ప్రకారం అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్సీల ఫొటోలు ఏర్పాటు చేయరా అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాల్లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభల ప్లెక్సీలలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఫొటోలు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కలెక్టర్, ఉన్న తాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉత్తీర్ణత సాధించాలి

అయిజ, జనవరి 22 : పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో రాములు అన్నారు. బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలకు పదో తరగతి యాక్షన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పదో విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేయాలన్నారు. రివిజన్ టెస్టులు నిర్వహించడంతోపాటు సబ్జెక్టులపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. సమావేశంలో హెచ్ఎంలు తిమ్మారెడ్డి, బలరాం, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

గొలుసుకట్టు వ్యాపారాలు చేయొద్దు

వనపర్తి టౌన్, జనవరి 22 : మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీం(గొలుసుకట్టు వ్యాపారాలు)ల జోలికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆన్‌లైన్ వ్యాపారంలో ఏజెంట్లను చేర్పించి లాభాలను పొందండి అనే మాయ మాటలు నమ్మవద్దని కోరారు. ఆర్థిక మోసాలకు పాల్పడినట్లు తెలిస్తే 1930, వాట్సాప్ 8712672222 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

ఎర్రవల్లి చౌరస్తా, జనవరి 22 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని పద్మావతి టాలెంట్ కమాండెంట్ సాంబయ్య అన్నారు. ఎర్రవల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

వనపర్తి టౌన్, జనవరి 22 : విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలో న్యాయసేవా ధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ధరూరు, జనవరి 22 : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వంట సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రాఘవేంద్ర పాల్గొన్నారు.

బడీడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

గద్వాల అర్బన్, జనవరి 22 : బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని ఆపరేషన్ స్మైల్ బృందం సభ్యులు, లేబర్ అధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం మల్దకల్ మండలంలోని బిజ్వారానికి చెందిన దాదాపు 20మంది పిల్లలు బడి మానేసి పొలంలో పని వెళ్తున్నారు. ఈ విషయం తెలుసుకొని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్సై కేశవరావు తదితరులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

అలంపూర్ చౌరస్తా, జనవరి 22 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గద్వాల మండలం కొండపల్లికి చెందిన జయరాం బైక్‌పై కర్నూలు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలో 44వ జాతీయ రహదారిపై చండూరు గ్రామానికి చెందిన శంకర్ కారులో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో జయరాం కాళ్లు విరిగిపోగా, అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

పాన్‌గల్, జనవరి 22 : గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని వెంగళాయిపల్లిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు వ్యాక్సినైజేషన్ టీకాలు, ఐరన్‌మాత్రలు, కాల్షియం, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి సూచనలు, సలహాలు చేశారు.

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ

గోపాల్‌పేట, జనవరి 22 : మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన చిన్న బుచ్చన్న(74) అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. రాష్ట్ర నాయకుడు శ్రావణ్‌కుమార్ రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు కురుమయ్య, ఓంకార్, వెంకటేశ్, కొండయ్య, మహేశ్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను